క్లుప్తంగా

పురోహితుడు 'పెద్దింటి'కి డాక్టరేట్


పెద్దింటి రామం

కొత్తపేట: గ్రామినిక చెందిన పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం)కి యూఎస్ఏకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) గౌరవ డాక్టరేట్, భారత కళారత్న అవార్డు ప్రకటించింది. ఈ మేరకు వర్సిటీ ఫౌండర్, చైర్మన్ పి.మాన్యూల్ నుంచి లేఖ అందిందని రామం గురువారం తెలిపారు. వాడపాలెం సంతోషిమాత ఆలయంలో అర్చకుడిగా, గ్రామ పురోహితుడిగా వంశ పారంపర్య వృత్తి చేస్తూ మరోపక్క వినూత్న ప్రయోగాలు చేయడం, అరుదైన వస్తువుల సేకరణను ఆయన ప్రవృత్తిగా మలుచుకున్నారు. ముఖ్యంగా 113 ఏళ్ల తెలుగు పంచాంగాల సేకరణ, పురాతన నాణేలు, ప్రపంచ దేశాల కరెన్సీ నోట్లు, అరుదైన మొక్కలు, రుద్రాక్షలు, పూసల వంటి ఎన్నో సేకరణలు, కళ్లకు గంతలు కట్టుకుని వందేమాతరం రాయడం, 5 లక్షల బియ్యం గింజలపై జాతీయ జెండా రంగులు అద్దడం, అనేక ప్రయోగాల ద్వారా ఇంత వరకూ రామం 82 రికార్డులు సాధించారు. తాజాగా జీహెచ్‌పీయూ గౌరవ డాక్టరేట్, భారత కళారత్న పురస్కారాలను వచ్చే నెల 9న చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో జరిగే విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం సందర్భంగా అందుకోనున్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఆలమూరు: పిల్లల్లో నులి పురుగుల నివారణ కోసం పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో ఆల్బెండజోల్ మాత్రల రెండో విడత పంపిణీ జరిగింది. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.మల్లికార్జున్ ఆధ్వర్యాన అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఈ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు, విద్యార్థులకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు మింగించారు. మండలంలోని 18 గ్రామాల్లో 12,039 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నది లక్ష్యం కాగా ఈ నెల 10వ తేదీన సుమారు 11 వేల మందికి అందించారు. మిగిలిన వారందరితో గురువారం మాత్రలు మింగించడంతో లక్ష్యం పూర్తయ్యిందని వైద్యాధికారులు తెలిపారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.

సత్యశైలజ దంపతులకు సన్మానం


సత్యశైలజ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

అంబాజీపేట: రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్‌గా కుడుపూడి సత్యశైలజ పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ నేపథ్యంలో సత్యశైలజ, భరత్ దంపతులను అంబాజీపేట సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి హరి, మట్టపర్తి బాలాజీ, గుబ్బల నాని, వేంద్ర శ్రీను, మట్టపర్తి జలంధర్, శివ, సుబ్బరాజు తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు.

రేపు వార్డు ఉప ఎన్నికలు

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డుకు స్థానిక మెట్ల కాలనీలోని షాదీఖానా భవనంలో శనివారం ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.మంగాదేవి, ఎంపీడీఓ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ ఎన్నికకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో బ్యాలెట్ పేపర్, బాక్సులు తదితర సామగ్రిని గురువారం పరిశీలించి, సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆ రోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు.

ఆత్రేయపురం: ర్యాలి గ్రామంలో 1వ వార్డు ఉప ఎన్నిక కూడా శనివారం జరుగుతుందని ఆత్రేయపురం ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ర్యాలిలోని బుల్లిరేవు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

అంబాజీపేట: ఇటీవల పాము కాటుకు గురై అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాకలగరువు సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబును పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దొరబాబుకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

మామిడికుదురు: ఒంగోలు జిల్లా దర్శి మండలంలో దళిత మహిళను వివస్త్రను చేసి, దాడి చేసిన కేసులో దోషులను వెంటనే శిక్షించాలని దళిత చైతన్య వేదిక డిమాండ్ చేసింది. నగరం గ్రామంలోని భారత్ నగర్‌లో దళిత చైతన్య వేదిక సమావేశం గురువారం జరిగింది. వేదిక ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వేదిక సమన్వయకర్త బత్తుల జనార్దనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు రక్ష

- పీఎం ఎంవీవైతో మేలు
- గర్భిణులకు రూ.5 వేల సాయం
- మూడు విడతలుగా చెల్లింపు
- రెండో కాన్పులో ఆడపిల్ల పుడితేనే పథకం వర్తింపు


పెదపళ్ల పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి భవానీ శంకర్

ఆలమూరు: మాతా శిశు సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎం ఎంవీవై) దోహదపడుతోంది. ఈ పథకాన్ని 2010లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజన(ఐజీఎంఎస్‌వై)గా ప్రారంభించింది. దీనిని ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 2016లో పీఎం ఎంవీవైగా మార్చారు. మరింత మందికి లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం మరిన్ని మార్పులు చేసింది.

దీని ద్వారా పేద, మధ్య తరగతికి చెందిన గర్భిణులకు రూ.5 వేలు చెల్లిస్తారు. ఇది గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు, నవజాత శిశువు సంరక్షణకు, వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 23 పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 4,367 మంది గర్భిణులకు పీఎం ఎంవీవై పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఇందుకు అవసరమైన వివరాలను ఆరోగ్య సిబ్బంది నమోదు చేస్తున్నారు. దీంతోపాటు మూడేళ్లుగా నమోదు చేసుకోని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. ఫలితంగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందే మహిళల సంఖ్య 10 వేలకు మించి ఉండవచ్చని చెబుతున్నారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితేనే ఈ పథకం వర్తిస్తుందని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుమలత తెలిపారు.

ఇవీ అర్హతలు

- గర్భం దాల్చిన మూడు నెలల లోపు పీఎం ఎంవీవై పథకం కోసం గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్‌లో పేరు నమోదు చేయించుకోవాలి.
- 19 సంవత్సరాలు నిండిన తరువాత గర్భం దాల్చిన మహిళలకే ఈ పథకం వర్తిస్తుంది.
- గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డు కలిగి ఉండాలి.
- పీహెచ్‌సీల్లో ప్రతి నెలా తొమ్మిదో తేదీన నిర్వహించే పీఎం ఎంఎస్‌వై శిబిరంలో తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.



ఎంసీపీ కార్డు

నగదు చెల్లిస్తారిలా..

- గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం జరిగే లోపు ప్రోత్సాహకంగా మూడు విడతల్లో రూ.5 వేలు చెల్లిస్తారు.
- మొదటి విడతగా అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో గర్భిణిగా నమోదైన వెంటనే ఆమె బ్యాంకు ఖాతాకు రూ.1,000 జమవుతుంది.
- గర్భం దాల్చిన నాటి నుంచి 6 నెలల పాటు క్రమం తప్పకుండా వైద్యులకు చూపించుకునే గర్భిణికి రెండో విడతగా రూ.2 వేలు అందిస్తారు.
- ప్రసవం అయిన తరువాత మూడో విడతగా మరో రూ.2 వేలు చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



నవజాత శిశువులు, తల్లుల సంరక్షణ కోసం అమలు చేస్తున్న పీఎం ఎంవీవై పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. నిర్ణీత సమయంలో వివరాలు నమోదు చేసుకుని, లబ్ధి పొందాలి. ఈ పథకంపై ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాం. – పి.ఉమ, హెల్త్ విజిటర్, పెదపళ్ల

విస్తృత ప్రచారం చేస్తున్నాం



పీఎం ఎంవీవై పథకం ఆవశ్యకత, గర్భిణులకు కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థంగా అమలు చేస్తున్నాం. గర్భిణిగా నమోదు చేసిన ప్రతి ఒక్కరికీ ఎంసీపీ కార్డు అందజేస్తున్నాం.
– వి.సువర్చల, ఎంఎల్‌హెచ్‌పీ, చింతలూరు

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

కొత్తపేట: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఓ టీచర్‌పై పోలీసులకు హెచ్‌ఎం ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ఎంపీపీ యూపీ స్కూల్‌లో పని చేసిన ఆర్‌వీ సత్యనారాయణ పదోన్నతిపై ఇటీవల వాడపాలెం జెడ్పీ హైస్కూల్‌కు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ నెల 7 నుంచి మూడు రోజుల పాటు పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ సంయుక్తంగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. కంప్లైంట్ బాక్సు పెట్టి వారి ఇబ్బందులు రాసి, అందులో వేయాలని సూచించారు. ఆ మేరకు పలువురు విద్యార్థినులు ఉపాధ్యాయుడు సత్యనారాయణ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొంటూ స్లిప్స్ వేశారు. ఈ విషయాన్ని ఆ ట్రస్ట్ ప్రతినిధులు కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. తీవ్రంగా స్పందించిన కలెక్టర్.. తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబుకు ఫోన్ చేసి, విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ బుధవారం ఆ పాఠశాలకు వెళ్లి 8వ తరగతి విద్యార్థినులను విచారించారు. 16 మంది కన్నీళ్లు పెట్టుకుంటూ ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనను వివరించారు. ఈ వివరాలను కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదించారు. కలెక్టర్ సూచనలతో డీఈఓ ఆదేశాల మేరకు సత్యనారాయణపై హెచ్‌ఎం వై.చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

లంపీ స్కిన్ నివారణ వ్యాక్సిన్ పంపిణీ

సఖినేటిపల్లి: ఆవుల్లో లంపీస్కిన్ వ్యాధి నివారణకు వెటర్నరీ సిబ్బంది గురువారం వ్యాక్సిన్ వేశారు. మండలంలోని శృంగవరప్పాడులో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సునీల్ గాంధీ ఆధ్వర్యంలో సిబ్బంది సుమారు 50 ఆవులకు ఈ వ్యాక్సిన్ వేశారు. వ్యాక్సినేషన్‌ను సర్పంచ్ రావి నాగ వెంకట లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు యెనుముల కొండమ్మ ప్రారంభించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి

అంబాజీపేట: శాస్త్ర, సాంకేతిక విద్యపై ప్రతి విద్యార్థీ దృష్టి సారించాలని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.సాయిరాం అన్నారు. పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతలు అందించిన సాయాన్ని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, కామిశెట్టి సత్యనాగభూషణరావు తల్లిదండ్రులు వీరాస్వామి నాయుడు, సూర్యకాంతం ట్రస్ట్ పేరిట 6 నుంచి 9 తరగతుల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారని వివరించారు. ఈ ట్రస్ట్ పేరిట గత 25 ఏళ్లుగా రూ.4 వేల చొప్పున విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నారన్నారు. హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి కృషి చేస్తానని నాగభూషణరావు హామీ ఇచ్చారని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- వెలిచేరులో రూ.62 లక్షలతో తాగునీటి పనులకు శంకుస్థాపన


రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వెలిచేరు గ్రామంలో రూ.62 లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకం పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రూ.28 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మించి, రూ.34 లక్షలతో పైపులైను నిర్మిస్తామని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మించేందుకు అంగీకరించారు. దీనికి అవసరమైన స్థలం ఇవ్వాలని సర్పంచ్ వేముల శ్రీనివాస్‌కు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం చేయడం తగదని విపక్షాలకు హితవు పలికారు. ఏ ప్రభుత్వ హయాంలో ఎంత లబ్ధి పొందారో అందరికీ తెలుసునని, బటన్ నొక్కి, వారి ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్ములు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞులైన ప్రజలు సమయం వచ్చినప్పుడు ఒకసారి బటన్ నొక్కి కృతజ్ఞతలు తెలుపుతారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ సీపీ అభిమానులైన కారణంగానే అర్హులైన వారికి పింఛన్లు రాకుండా అప్పటి జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎటువంటి రికమెండేషన్లూ లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా అన్ని పథకాలూ అందిస్తోందని జగ్గిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యుడు వేముల వెంకన్నబాబు, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు జనం నీరాజం

- రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- గోగన్నమఠంలో గడప గడపకూ..


గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం నీరాజనాలు పలుకుతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గోగన్నమఠం గ్రామంలో పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబురాజు ఆధ్వర్యాన గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్ల జగన్ పాలనకు విశేష స్పందన లభిస్తోందని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే అద్భుత అవకాశం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలకూ మేలు చేస్తూ, సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే రాపాక అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నరసింహవర్మ (బాబు), బొలిశెట్టి భగవాన్, గ్రామ శాఖ అధ్యక్షుడు సాగి సత్యనారాయణరాజు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

బిల్లు బకాయిలపై విద్యుత్ శాఖ స్పెషల్ డ్రైవ్


సఖినేటిపల్లి మండలంలో సర్వీసులను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

సఖినేటిపల్లి/మలికిపురం/రావులపాలెం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిల్లు బకాయిలు ఉన్న సర్వీసులపై విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ వివరాలను ఏపీ ఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ (ఆపరేషన్స్) ఎం.రవికుమార్ మీడియాకు తెలిపారు. ఫోర్‌మెన్స్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ అకౌంటు ఆఫీసర్లు, జూనియర్ అకౌంటు ఆఫీసర్లు తదితర కేడర్‌కు చెందిన ఉద్యోగులు మొత్తం 31 బృందాలుగా ఏర్పడి, గడువు పూర్తయినా, బిల్లులు చెల్లించకుండా విద్యుత్ వాడుకుంటున్న కనెక్షన్లను తొలగించారు. సఖినేటిపల్లి మండలంలో మొత్తం 412 విద్యుత్ సర్వీసులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా సుమారు రూ.41,77,220 మేర వినియోగదారులు చెల్లించారు. బిల్లులు చెల్లించని కనెక్షన్లు తొలగించారు. ఆగస్టులో వచ్చిన బిల్లులకు కనెక్షన్లు తొలగించకుండా, గడువు లోగా చెల్లించాల్సిందిగా ఆయా వినియోగదారులను కోరారు.

మలికిపురం మండలంలో బిల్లు బకాయిలు చెల్లించని 262 విద్యుత్ కనెక్షన్లను తొలగించినట్టు ఏఈ మద్దూరి సతీష్ తెలిపారు. వీరు పూర్తి బిల్లులు చెల్లించి, రీ కనెక్షన్ ఆర్డర్ తీసుకున్న అనంతరం సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. ఇంకా బిల్లులు చెల్లించని సర్వీసులు 1,500 ఉన్నాయన్నారు. శనివారం, సోమవారం వీరి కనెక్షన్లు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఒక్క రోజే రూ.26.5 లక్షల మేర మొండి బకాయిలు వసూలయ్యాయని తెలిపారు.

నేడు రావులపాలెంలో..

రావులపాలెం మండలంలోని విద్యుత్ వినియోగదారులు పెండింగ్, ఏసీడీ, అడిషనల్ లోడ్ బిల్లులు, నెలకు 200 యూనిట్లు దాటి వినియోగిస్తున్న వారు వెంటనే చెల్లించాలని ఈఈ రవికుమార్ తెలిపారు. అధికారులు శుక్రవారం మండలంలో తనిఖీలు చేసి, ఎటువంటి బకాయిలున్నా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు సహకరించి బిల్లు బకాయిలు చెల్లించాలని కోరారు.

గ్రామస్తులు, ఆక్వా రైతుల సమస్య పరిష్కారం


సమన్వయ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు, నేతలు

ఆత్రేయపురం: తాగునీటి విషయంపై గ్రామస్తులు, ఆక్వా రైతుల మధ్య తలెత్తిన వివాదం గురువారం ఒక కొలిక్కి వచ్చిందని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఈ వివాదంపై కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు ఇరు వర్గాలతో ఎంపీడీఓ బుజ్జి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు, మండల మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డేవిడ్‌రాజు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామస్తుల తరఫున గెద్దం లక్ష్మణరావు మాట్లాడుతూ, తమ చుట్టూ ఉన్న పైపుల ద్వారా ఉప్పు నీరు వస్తోందంటున్నారని, తమ పైపు నుంచి వస్తున్న తాగునీరు బాగానే ఉందని అన్నారు. సరెళ్ల సత్తిపండు మాట్లాడుతూ, ఆక్వా చెరువుల కారణంగా తాగునీటి బోర్ల నుంచి కొంత మేర ఉప్పు నీరు వస్తోందని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా త్వరగా మంచినీటి పైపులైన్ల పనులు ప్రారంభించి, తాగునీరు అందించాలని కోరారు. రైతుల తరఫున ముదునూరి వెంకట కృష్ణంరాజు, గాదిరాజు ప్రసాదరాజు, ముదునూరి నాగరాజు, వేగేశ్న గోపాలరాజు మాట్లాడుతూ, గతంలో ఏటిగట్లను ఆధునీకరించేందుకు అవసరమైన మట్టిని ప్రభుత్వానికి ఇవ్వడం వలన అక్కడి ఆక్వా చెరువుల్లో పంట తీసుకునేందుకు వ్యవధి కావాలని అన్నారు. అక్టోబర్ 30 లోగా రైతులు ఆక్వా పంటను తీసివేసి, మంచినీటి చెరువులుగా మార్చుకోవాలని, వెంటనే తాగునీటి పనులు ప్రారంభించి 15 రోజుల్లోగా గ్రామస్తులకు కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు చెప్పారు. సమస్యను పరిష్కరించుకోవడానికి రైతులు, గ్రామస్తులు ఒప్పందం చేసుకున్నారు.

మిత్రుడికి అండగా..


వినోద్ కుమార్‌కు సాయం చేస్తున్న ఎంఈఓ కిషోర్ కుమార్, సర్పంచ్ చిట్టిబాబు

సఖినేటిపల్లి: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ వ్యక్తికి స్నేహితులు అండగా నిలిచారు. స్థానిక ఆబోతు గుడి వద్ద ఉంటున్న నక్కా వినోద్ కుమార్ అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. అతడికి 2008 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.50 వేల ఆర్థిక సాయం సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఎంఈఓ డి.కిషోర్ కుమార్, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు గురువారం బాధితుడికి అందజేశారు. స్నేహితులు పి.శ్రీకర్, పి.అన్వేష్, ఎ.ప్రసాద్, ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది
చింతపల్లి నరసింహమూర్తి అను నేను పి.గన్నవరం (పితానివారిపాలెం) నుండి పి.గన్నవరం జిరాక్స్ షాపుకు వెళ్తుండగా నా ఆవుట్ పాస్‌పోర్టు నెం.X0532239 పడిపోయినది. దొరికినవారు తెలియజేయగలరు.
చింతపల్లి నరసింహమూర్తి
S/o. కృష్ణ, పి.గన్నవరం(పితానివారిపాలెం)
పి.గన్నవరం మండలం. ఫోన్: 9160925589

గుడిమెళ్లంకలో పొలంబడి

మలికిపురం: మండల వ్యవసాయ క్షేత్రం ఆధ్వర్యాన గుడిమెళ్లంకలో రైతులకు గురువారం పొలంబడి నిర్వహించారు. వరి నాట్లు వేసినప్పటి నుంచి కోతల వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి కె.రాకేష్ అవగాహన కల్పించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, సర్పంచ్ నల్లి విజయ కుమారి పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

సఖినేటిపల్లి/మామిడికుదురు: స్వాతంత్ర్య దినోత్సవం నాడు అమలాపురంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా తహసీల్దార్ వై.రామకుమారి, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్ ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని గురువారం సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, నాయకులు నల్లి ప్రేమానందం, కుసుమ రాకేష్ తదితరులు వీరిని సత్కరించారు. అలాగే, మంత్రి నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక వీఆర్‌ఓ ఆర్‌ఎస్ఎస్ టీఎస్ రాయుడును కూడా సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు ఆధ్వర్యాన పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అంబాజీపేట వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ అన్నారు. వాకలగరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, గుండె వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటే కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

కొత్తపేట: వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పిలుపునిచ్చారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యాన కళాశాల ప్రాంగణంలో గురువారం 75 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ 'మట్టికి నమస్కారం.. వీరులకు వందనం' కార్యక్రమాల్లో ప్రసంగించారు. అడవులను నరికివేయడం, రసాయనిక పరిశ్రమల వల్ల గాలి, నీరు, భూమి, ఆకాశం కలుషితమై పర్యావరణం దెబ్బ తింటుందని అన్నారు. కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అయినవిల్లి/కొత్తపేట/మామిడికుదురు: చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో ఈ విషయం తెలిపారు. అయినవిల్లి, ఎస్.మూలపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని 21 గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం కొత్తపేట పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలు, వాడపాలెంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. నగరం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని మామిడికుదురు, నగరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

తాడివారి మెరకలో ప్రత్యేక వైద్య శిబిరం

మామిడికుదురు: నగరం గ్రామంలోని తాడివారి మెరకలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యాన గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యాన 48 మందికి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. సర్పంచ్ జాలెం రమణకుమారి, ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు, సీహెచ్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఎన్నిక

రాజోలు: తాలూకా గణేష్ నిమజ్జన కమిటీ ఎన్నిక స్థానిక శివాలయం ప్రాంగణంలో గురువారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షులు దార్ల పెదబాబు, కంచర్ల గణపతి ఆధ్వర్యాన రాజోలు ఉప సర్పంచ్ పామర్తి రమణ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పట్నాల దత్తాత్రేయ, కోశాధికారిగా కామన సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ గోపాలకృష్ణలను ఎన్నుకున్నారు. వచ్చే నెల 18న వినాయక చవితి వేడుకలు, అదే నెల 27న తాలూకా గణేష్ నిమజ్జన మహోత్సవం నిర్వహించాలని తీర్మానించారు.

పూడికతీత ప్రారంభం

పి.గన్నవరం: గాజులగుంట కాలువలో పూడిక తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. కాలువలో పేరుకుపోయిన పూడికను, కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని రైతులు ఇటీవల ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు, రైతులు కలిసి ఈ పంట కాలువను పరిశీలించారు. సాయంత్రం జేసీబీతో పూడికతీత ప్రారంభించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

సఖినేటిపల్లి: బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలనే డిమాండ్‌తో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర ఈ నెల 22న జిల్లాలో జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. గొందిలో నల్లి బుజ్జిబాబు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో యాత్ర కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఆ రోజు సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ నుంచి అమలాపురానికి బైక్ ర్యాలీగా వెళ్లాలని తీర్మానించారు.

అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు



ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న సఖినేటిపల్లి మండల తాహశీల్దారు శ్రీమతి వై.రామకుమారి గారు
ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న సఖినేటిపల్లి మండల డిప్యూటీ తాహశీల్దారు శ్రీ సి.హెచ్.భాస్కర్ గారు

దొంగ నాగ సత్యన్నారాయణ (యేసుబాబు)
రాష్ట్ర వైఎస్సార్‌సిపి యువజన జాయింట్ సెక్రటరీ
అంతర్వేది

చెల్లుబోయిన కేశవశెట్టి
మాజీ జెడ్పీటీసి
రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి
అంతర్వేది

ఆకన నాగేశ్వరరావు
సి.పి.ఐ. నాయకులు
గొంది